క్లుప్తంగా

పరామర్శ

ఖానాపురం: మండలంలోని బుధరావుపేటకు చెందిన మియాసాబ్ అనారోగ్యంతో మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముస్తాఫా, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



సంగెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పరకాల బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరినట్లు మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి తెలిపారు. బుధవారం నల్లబెల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు వల్లే అశోక్, కుంటపల్లి గ్రామ అధ్యక్షుడు పుల్ల ఎల్లయ్యతో పాటుగా 50 మంది, నల్లబెల్లి గ్రామ గౌడ సంఘం నాయకులు మెరుగు సదానందం, శ్రీనివాస్, బైరి సాంబయ్య, పూజారి కుమారస్వామి, అశోక్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు.

సఖి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పర్వతగిరి: సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖి కౌన్సిలర్స్ సుధా, నిర్మలాదేవిలు సూచించారు. మండలంలోని కల్లెడలోని జ్యోతి ఎస్‌హెచ్‌జీ గ్రూప్, పర్వతగిరి అంగన్‌వాడీ కేంద్రాల్లో, కల్లెడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికలు అనేక హింసలకు గురవుతున్నారని, అలాంటివి జరుగకుండా ఉండటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సఖి కేంద్రాలను ఏర్పాటు చేశాయన్నారు. సఖి కేంద్రం మహిళా శిశు సంక్షేమ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు. మహిళ రక్షణ చట్టాలు, సఖి కేంద్రంలో అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. మహిళా హెల్ప్ లైన్ 181కి కాల్ చేసిన వెంటనే సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రుక్మిణి, రాణి, అరుణాదేవి, మహేశ్వరి వీఓఏ, గ్రూప్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్లు

రక్తదానంపై అనేక అపోహలు

నర్సంపేట: రక్తదానం ప్రాణదానం వంటిది కానీ నేటికి రక్తదానంపై అనేక అపోహలు ఉన్నాయని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బుధవారం రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల బలహీనత, అనేక వ్యాధులు దారి తీస్తుందని అపోహ పడుతుంటారన్నారు. రక్తదానం అనేది మనందరి సామాజిక బాధ్యత అన్నారు. రక్తం మనకు ప్రకృతి ప్రసాదించిన అత్యంత విలువైన బహుమతి అని తెలిపారు. ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేష్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మాయమాటలు నమ్మి మోసపోవొద్దు



మడికొండ : ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్



హసన్‌పర్తి: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్

- బీఆర్‌ఎస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్

మడికొండ: మాయమాటలు చెప్పే ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ ఓటర్లకు సూచించారు. 46, 64వ డివిజన్లలోని టేకులగూడెం, మడికొండ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. మడికొండలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి అక్రమంగా రూ.వేల కోట్లు సంపాదించాడని, అడ్డదారిలో బీఫాం తెచ్చుకున్నాడని ఆరోపించారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, ఆపదలో ఆదుకునే తనను ఆదరించి గెలిపించాలని కోరారు. డంపింగ్ యార్డు ప్రధాన సమస్యను తీర్చేందుకు జర్మనీ సంస్థతో ఒప్పందం జరిగినట్లు చెప్పారు. త్వరలోనే డంపింగ్ యార్డులోని చెత్తను రీసైక్లింగ్ ద్వారా తొలగించి పార్కుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షురాలు లలితాయాదవ్, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు రాధికరెడ్డి, సరోజన, వినోద్, దువ్వ శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

హసన్‌పర్తి : 65వ డివిజన్ చింతగట్టుకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి పార్టీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆహ్వానించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైతు రుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, కార్పొరేటర్ దివ్యారాణి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, పాల్గొన్నారు.

అరూరి గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం

అరూరి రమేష్ గెలుపు కోరుతూ బుధవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. హసన్‌పర్తి, ముచ్చర్ల, మంత్రపురికాలనీ, భీమారం, కోమటిపల్లి, దేవన్నపేట, వంగపహాడ్, గోపాలపురం, అన్నాసాగరం గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. కార్పొరేటర్లు జక్కుల రజిత, సునీల్‌కుమార్, సురేందర్‌రెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలి

చెన్నారావుపేట: అబద్దాల కోరు కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని బీఎస్పీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి గుండాల మదన్‌కుమార్ అన్నారు. మండలంలోని జల్లీ, ఎల్లయ్యగూడెం, పాపయ్యపేట, చెరువుకొమ్ముతండా,పుల్లయ్యబోడు తండా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల బాధ్యులు రాములు, గుండాల ఝాన్సీరాణి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

నర్సంపేట: ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపుతానని బీజేపీ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంభంపాటి పుల్లారావు(ప్రతాప్) అన్నారు. పట్టణంలోని 162, 163, 164 బూత్‌లలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మరో మారు గెలిపిస్తే.. మరింత అభివృద్ధి

గీసుకొండ: తనను మరో మారు గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని పరకాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బుధవారం చంద్రయ్యపల్లి, రాంపూర్, మనుగొండ, గంగదేవిపల్లి, మరియపురం, కొనాయమాకుల, ఊకల్, గీసుకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరినట్లు మండల నాయకులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



నర్సంపేట : నల్లబెల్లి మండలం శనిగరం గ్రామానికి చెందిన మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు అధ్యక్షుడు డ్యాగల రాజేష్‌తో పాటు మరికొంత మంది దొంతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని చెరువుకొమ్ము తండాకు చెందిన ఉప సర్పంచ్ కొర్ర రంగమ్మతో పాటు 20 కుటుంబాలు గ్రామ అధ్యక్షులు రాందాస్, ఎంపీటీసీ రమాబాయి, మైబు సింగ్‌ల ఆధ్వర్యంలో 20 కుటుంబాలు దొంతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఖానాపురం: మండలంలోని చిలుకమ్మతండా, ఖానాపురం గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

రాయపర్తిలో..



రాయపర్తి: మండలంలోని కాట్రపల్లికి చెందిన బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ముప్పిడి విజయ్‌గౌడ్, రాపాక రాజు, చిర్ర శరత్, చెన్నబోయిన హరీష్, తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

పార్టీ వీడడం వల్ల ఎలాంటి నష్టం లేదు

పర్వతగిరి: స్థానిక జెడ్పీటీసీ సింగ్‌లాల్ పార్టీ మారడం వల్ల బీఆర్‌ఎస్‌కు, అరూరి రమేష్‌కు ఎలాంటి నష్టం లేదని మండల ఎస్టీ గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు అన్నారు. హన్మకొండ ప్రశాంత్‌నగర్‌లో నివాసంలో బుధవారం మండల ఎస్టీ గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రమేష్‌ను కలిశారు.

కాంగ్రెస్‌లో చేరడాన్ని వ్యతిరేకిస్తున్న పార్టీ

పర్వతగిరి : స్థానిక జెడ్పీటీసీ బానోతు సింగ్‌లాల్ కాంగ్రెస్‌లో చేరడాన్ని కాంగ్రెస్ మండల కమిటీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగ్‌లాల్ అనేక భూకబ్జాలు, అక్రమాలు చేశారని బీఆర్‌ఎస్ వారు ఆరోపిస్తూ బాణసంచాలు పేల్చి పార్టీ వీడినందుకు సంబురాలు జరుపుకున్నారని, అలాంటి వ్యక్తిని ఎందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, రతన్‌రావు, కిషన్, రమేష్, శ్రీనివాస్, చొక్కారావు, మురళీధర్‌రావు, పాల్గొన్నారు.

ఉపసంహరణ అభ్యర్థులు బీఆర్‌ఎస్‌కు మద్దతు

వర్ధన్నపేట: వర్ధన్నపేట అసెంబ్లీ స్థానానికి నామినేషన్లు వేసిన ఆరుగురు అభ్యర్థులు బీఆర్‌ఎస్ తరపున పోటీ చేస్తున్న అరూరి రమేష్‌కు మద్దతుగా తాము పోటీ నుంచి విరమించుకున్నట్లు ప్రకటించి వీరిలో ఐదుగురు బీఆర్‌ఎస్‌లో చేరారు. బుధవారం ఉపసంహరణ అనంతరం వర్ధన్నపేట బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ గత పాలకుల కంటే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన అరూరికి మద్దతు తెలపడం శుభపరిణామన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం ఎన్నికల సమయంలోనే కనబడి కనుమరుగై పోతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, యాకయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

ఆరుగాలం కష్టపడితే సగం పంటే చేతికి..

- సీడ్స్ షాపు ఎదుట నిరసన
- ఏఓకు వినతిపత్రం అందించిన రైతులు

నర్సంపేట రూరల్ : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు చేతికొచ్చే సమయానికి సగం దిగుబడే వస్తుండడం రైతన్న దిగాలు చెందుతున్నారు. పట్టణంలోని ద్వారకపేట చెందిన 10 మంది రైతులు సుమారు 80 ఎకరాలు, చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌కు చెందిన 20 మంది రైతులు సుమారు 70 ఎకరాల వరకు ఎంటీయూ 1224 సన్నరకం 150 రోజుల పంటను సాగు చేశారు. ఈ విత్తనాలను పట్టణంలోని బాలాజీ, కిషాన్ సీడ్స్ షాపుల్లో రైతులు కొనుగోలు చేసి పంటను సాగు చేశారు. ఇప్పటి వరకు దాదాపు 130 రోజులకు పంట చేరింది. అయితే ఈ రకంలో 60–70 శాతం పంట గింజ పూర్తిగా తయారై కనిపిస్తోంది. 40–30 శాతం ఇప్పుడే పాలు పోసుకుంటూ, గొలుసు వేస్తూ వివిధ దశల్లో ఉందన్నారు. సుమారు రూ.30వేల నుంచి రూ. 40వేల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. దీనిపై షాపుల యాజమానులతో మాట్లాడినప్పటికీ సరైన సమాచారం అందించకపోవడంతో రైతులు షాపుల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి చేరుకొని వినతిపత్రాన్ని అందించారు.



దెబ్బతిన్న వరి పంట

ఉన్నతాధికారులకు నివేదించాం : కృష్ణ కుమార్, ఏఓ, నర్సంపేట

పట్టణంలోని ద్వారకపేటలో, తిమ్మరాయినిపహాడ్ గ్రామాల్లో 150 రోజుల పంట అయిన ఎంటీయూ సన్నరకం వంగడం రైతులు సాగు చేసిన విషయం వాస్తవమేనన్నారు. సుమారు 80 ఎకరాలలో పంట సాగుచేశారని, పంట కాలం ఎక్కువగా ఉంటుందని అన్నారు. రైతుల ఈ వంగడంలో కల్తీ విత్తనాలు వచ్చాయని, అందుకే రెండు విధాల పంట కనబడుతోందన్నారు. రైతుల ఆరోపణ మేరకు దీనిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, జిల్లా ఉన్నతాధికారులకు నివేదించామని, జిల్లా అధికారులు పంటను పరిశీలించేందుకు శాస్త్రవేత్తలను పంపిస్తామని, వారి నివేదిక మేరకు సంబంధించి సీడ్స్ కంపెనీ యాజమానులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
- కేసు నమోదు చేసిన పోలీసులు

నర్సంపేట రూరల్ : చికిత్స పొందుతూ బాలిక మృతిచెందింది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన బోడ తార్య–సైంత్ర దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె అఖిల (10) ఉన్నారు. అఖిల నెక్కొండ మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. నాలుగు రోజుల క్రితం అఖిలకు జ్వరం రావడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేసినా నయం కాకపోవడంతో నర్సంపేట పట్టణంలోని క్రెడిల్ పిల్లల ఆస్పత్రికి ఈనెల 13న అర్ధరాత్రి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేసి మృతిచెందినట్లు తెలిపారు. అఖిల మృతదేహాన్ని అదేరోజు రాత్రి నర్సంపేటలోని క్రెడిల్ ఆస్పత్రికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. సీఐ రవి కుమార్‌ను వివరణ కోరగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

మా తప్పిదం ఏమీ లేదు..

కుటుంబ సభ్యులు బాలికను ఈనెల 13న అర్ధరాత్రి మా ఆస్పత్రికి తీసుకురాగానే పరిశీలించాం. అప్పటికే ఆర్‌ఎంపీ వేసిన టీకాతోనే తొంటి భాగానికి పూర్తిగా ఇన్ఫెక్షన్ అయ్యింది. చూసి రెఫర్ చేస్తామని చెప్పగా మీరే చికిత్స చేయాలని కుటుంబ సభ్యులు కోరడంతో చికిత్స అందించాం. అఖిలకు ఇన్ఫెక్షన్ ఎక్కువ కావడంతో వరంగల్‌కు రెఫర్ చేశాం. ఇందులో మా తప్పిదం ఏమీ లేదు.

– డాక్టర్ అరుణ్, క్రెడిల్ పిల్లల ఆస్పత్రి

గడువు పొడిగింపు

శాయంపేట : టెన్త్, ఇంటర్‌లో ఓపెన్ ప్రవేశాల అడ్మిషన్ పొందేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీలత బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉండగా అభ్యర్థులకు మరో అవకాశం కల్పించేందుకు పొడగించినట్లు తెలిపారు. ఓపెన్‌స్కూల్ వెబ్ సైట్‌ను వీక్షించి అడ్మిషన్ పొందాలని సూచించారు. అలాగే విధంగా మండల కేంద్రానికి చెందిన డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారి నుంచి 8, 9వ తరగతి సోషల్, మ్యాథ్స్ సబ్జెక్టులు బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

అర్హులందరు ఓటుహక్కు వినియోగించుకోవాలి

శాయంపేట : మండలంలోని అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ సుభాషిణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ఆయుధం ఓటుహక్కు అన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలని సూచించారు. చదువుకున్న యువకులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

‘స్వీప్’ అవగాహన సదస్సులు

వరంగల్ : ఓటింగ్ శాతం పెంచడమే ధ్యేయంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధి డివిజన్లలోని సాకరాశికుంట, ఎన్టీఆర్‌నగర్, మురికివాడల్లో మెప్మా సిబ్బంది బుధవారం ఓటరు చైతన్యంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఓటు ప్రయోజనాలు, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. ర్యాలీల్లో స్వయం సహాయక మహిళా బృందాల సభ్యులు, స్థానిక మహిళలు, ప్రజలను భాగస్వాములను చేస్తూ ఓటు ప్రాధాన్యాన్ని వివరించినట్లు నోడల్ అధికారి బ్రజేష్ తెలిపారు. ఎస్వీఈఈపీ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్–స్వీప్)–2023లో భాగంగా ఓటరు ప్రచార రథంలోని ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానం, వేసిన ఓటు నిర్ధారణపై అవగాహన కలిగించినట్లు పేర్కొన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న స్థానికులు, సిబ్బందితో అధికారులు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.



స్వీప్‌లో భాగంగా ఓటర్లపై అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

శ్రీనివాసాచారి సేవలు మరువలేనివి

నెక్కొండ: తెలంగాణ ఉద్యమ నేత, ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేసిన రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ డింగరి శ్రీనివాసాచారి సేవలు మరువలేనివని పూర్వ విద్యార్థులు కొనియాడారు. స్థానిక హైస్కూల్‌లో 1994–95 పదోతరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం శ్రీనివాసాచారి 81వ జయంతి వేడుకలు జరిగాయి. తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా మండల జేఏసీ కన్వీనర్‌గా అన్ని వర్గాల ప్రజలను తెలంగాణ ఉద్యమం వైపు నడిపించిన ఘనత డింగరికే దక్కుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఇండియా, వరల్డ్ మ్యాప్‌లను వారు అందించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెడ్మాస్టర్ రంగారావు, హితకారిణి సేవా సంఘం మండల అధ్యక్షుడు గటిక మల్లయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మ్యాప్‌లను అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

భద్రకాళి దేవాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు



హన్మకొండ కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన దివీస్ లాబోరేటరీస్ సహకారంతో రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను భద్రకాళి దేవాలయంలో ఏర్పాటు చేశారు. ఈమేరకు దేవస్థానం పక్కన, పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను ఆలయ ఈఓ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకుడు శేషు, అర్చకులు, సిబ్బంది, దివీస్ లాబోరేటరీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



దుగ్గొండి: పొనకల్‌లో ఇంటింటికి ప్రచారం చేస్తున్న పెద్ది సతీమణి స్వప్న

- బీఆర్‌ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది

నర్సంపేట రూరల్ : పేదల సంక్షేమానికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసమే కృషి చేస్తానని నర్సంపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగుర్లపల్లి, మాధన్నపేట, భోజ్యానాయక్‌తండా, బానోజీపేట, చంద్రయ్యపల్లి, రాజేశ్వర్‌రావుపల్లి, దాసరిపల్లి, కమ్మపల్లి, పర్శనాయక్ తండా, రాజపల్లి, ముగ్దుంపురం గ్రామాల్లో పెద్ది ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆవిర్భావం నుంచి నేటి వరకు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూ వస్తోందన్నారు. గత రెండేళ్లుగా అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల కోసం నష్టపరిహారం కోసం ప్రత్యేక జీఓ తీసుకొచ్చి అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. మండలంలోని భోజ్యానాయక్‌తండాకు చెందిన పలు పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే పెద్ది వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ జయమ్మ, గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, రైతు సమన్వ సమితి మండల కన్వీనర్ మోతె జయపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పతి కోసం... సతి ఇంటింటి ప్రచారం

దుగ్గొండి: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు పెద్ది సుదర్శన్‌రెడ్డిని రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని పొనకల్‌లో పెద్ది గెలుపు కోరుతూ ఆయన సతీమణి స్వప్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి మహిళకు బొట్టు పెడుతూ తన భర్తను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో మాట్లాడారు. రాష్ట్రంలోనే నర్సంపేటలో నివాసం ఉన్న ఏకైక ఎమ్మెల్యే పెద్ది అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

ఖానాపురం: మండలంలోని బుధరావుపేటకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ది భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

పర్వతగిరి : కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని మండల వ్యవసాయాధికారి ప్రశాంత్ అన్నారు.మండలంలోని మాల్యతండా, చౌటపల్లి, సో మారం, కల్లెడ, రావూరు, అన్నారం, దౌలత్‌నగర్ గ్రామాల్లో బుధవారం ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కృష్ణమూర్తి, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ ప్రశాంత్